
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 26 నవంబరు 2024



విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



● గర్భిణులు, వృద్ధులకు మాస్కులు తప్పనిసరి

● వైద్యనిపుణుల హెచ్చరిక



చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ఏ ఆస్పత్రిలో చూసినా బాధితులతో కిటకిటలాడుతోంది. రాజధాని నగరం చెన్నైలోనూ వైరల్ ఫీవర్ కేసులు అధికంగా ఉన్నాయని వైద్యనిపుణులు హెచ్చరించారు. ఈ వైరల్ ఫీవర్ బాధితులు వైద్య చికిత్స తర్వాత మూడు రోజుల్లోనే కోలుకునే అవకాశమున్నా ఈ జ్వరంతో పాటు దగ్గు, వంటి నొప్పులు కూడా తోడవుతుండటంతో కోలుకోవడానికి వారం రోజులు పడుతోందని వైద్యులు చెబుతున్నారు. ఈ జ్వరాలు రాకుండా ఉండేందుకు గర్భిణులు, వృద్ధులు తప్పకుండా మాస్కులు ధరించాలని కూడా సూచిస్తున్నారు. ఈ జ్వరాలు రావటానికి ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ప్రధాన కారణమని, కొందరికి ఇన్‌ఫ్లూయెంజా ఏ వైరస్, మరికొందరికి ఇన్‌ఫ్లూయెంజా బీ వైరస్ కారణమవుతోందన్నారు. కొందరికి ఆడినోవైరస్ కారణంగా శ్వాసకోశ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో చెదురుమదురుగా కురుస్తున్న వర్షాల కారణంగా చలిగాలులు అధికం కావటం వల్ల కూడా జ్వరాలు వ్యాపిస్తున్నాయని వైద్యనిపుణులు తెలిపారు. పాఠశాలల్లో చదివే బాలబాలికలు కూడా ఈ వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారని, వారికి తల్లిదండ్రులు సకాలంలో చికిత్స అందించాలన్నారు. ఈ జ్వరాల బారిన పడకుండా గర్భిణులు, 60 యేళ్లకు పైబడిన వృద్ధులు ముఖాలకు తప్పకుండా మాస్కులు ధరించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల కోసం విళుదుగళ్

● షోళింగనల్లూరులో సమగ్రసేవా కేంద్రం ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షోళింగనల్లూరులోని కన్నగినగర్ ప్రాంతంలో రాష్ట్రంలోనే మొదటిసారిగా ఏర్పాటైన 'విళుదుగళ్' పేరిట సమగ్ర సేవా కేంద్రాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న దివ్యాంగుల హక్కుల సాధన పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 'విళుదుగళ్' పేరుతో 273 సమగ్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, వాటిలో మొదటి సమగ్ర సేవా కేంద్రాన్ని షోళింగ నల్లూరులో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సేవా కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేక విద్యాబోధన, కంటి చికిత్స, వినికిడి సంబంధిత చికిత్స, స్పీచ్ థెరపీ సహా ఆరు రకాల సేవలను దివ్యాంగులకు అందజేస్తామన్నారు. ఈ సేవలందించడానికి ఆయా రంగాల్లో నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉంటారని ఆయన వివరించారు. ఈ కేంద్రంలో సీఎం బీమా పథకాన్ని కూడా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధివిధానాలకు అనుగుణంగా ఈ కేంద్రాన్ని నిర్మించామని, ఇక్కడ దివ్యాంగులు నడిపే ఆవిన్ పాలకేంద్రం కూడా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, శాసనసభ్యులు ఎస్.అరవింద్ రమేష్, ఏఎంవీ ప్రభాకర్‌రాజా, కె.గణపతి, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి సీజీ థామస్ వైద్యన్, దివ్యాంగుల సంక్షేమశాఖ సంచాలకులు ఎం.లక్ష్మి, రాష్ట్ర నగర నివాసాభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ కె.విజయ కార్తికేయన్, రాష్ట్ర దివ్యాంగుల కమిషనర్ ఇరా సుదన్ తదితరులు పాల్గొన్నారు.





'విళుదుగళ్' సేవాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి



సేవాకేంద్రంలో ఓ బాలుడితో సీఎం ముచ్చట్లు

ఎళిల్‌నగర్ స్కూల్‌లో స్టాలిన్ తనిఖీ

షోళింగనల్లూరు సమీపం ఎళిల్‌నగర్‌లో శ్రీరామచరణ్ ప్రజా సంక్షేమ ట్రస్టు, జీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు మాంటిసోరి విద్యాబోధన అందిస్తున్న మిడిల్ స్కూలు లో ముఖ్యమంత్రి స్టాలిన్ తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆ పాఠశాలలోని చిన్నారులకు విద్యా ఉపకరణాలను అందజేశారు. ఎళిల్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న ఆ మిడిల్ స్కూల్‌ను శ్రీరామచరణ్ ట్రస్టు సహకారంతో, చెన్నై కార్పొరేషన్ 'నమక్కునామే' పథకం ద్వారా రూ.69లక్షలతో ఐదు తరగతి గదులతో పునర్నిర్మించారు. ఆ పాఠశాలలో మాంటిసోరి తరగతుల నిర్వహణకు విద్యా ఉపకరణాలను కార్పొరేషన్ సమకూర్చింది. ఈ పాఠశాలను స్టాలిన్ తనిఖీ చేసి అక్కడి ఉపాధ్యాయులతో అక్కడ చదువుతున్న చిన్నారులతో మాట్లాడారు. కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రూ, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్, శ్రీరామచరణ్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు పద్మినీ గోపాలన్, అధ్యక్షురాలు కె.భారతి తదితరులు పాల్గొన్నారు.

వాయుగండం ఎదుర్కొంటాం!

● ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వాయుగుండం, ఈశాన్యరుతుపవనాల కారణంగా ఎంత వర్షం పడినా ప్రభుత్వ యంత్రాంగం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. షోళింగనల్లూరులో దివ్యాంగుల సమగ్ర సేవా కేంద్రం ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... నెల రోజుల క్రితమే తాను జిల్లా కలెక్టర్లతో రుతుపవన ప్రభావిత వర్షాలను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై, బాధితులకు కల్పించాల్సిన సహాయక చర్యలపై సమగ్రంగా చర్చించి, ఆదేశాలు జారీ చేశానన్నారు. భారీ వర్షమొచ్చినా, ఓ మోస్తరు వర్షం కురిసినా ప్రభుత్వ యంత్రాంగం ఆ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని చెప్పారు. నగరంలోనూ జీసీసీ ఉన్నతాధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారని, పల్లపు ప్రాంతాల్లో వాననీరు, మురుగునీటిని తొలగించేందుకు మోటారు పంపులను కూడా సిద్ధంగా ఉంచారని చెప్పారు. పార్లమెంట్ సమావేశంలో డీఎంకే, మిత్రపక్షాల ఎంపీలంతా రాష్ట్ర హక్కుల కోసం, వివిధ పథకాలకు నిలిపివేసిన నిధుల విడుదల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తారన్నారు. అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి రాష్ట్ర విద్యుత్ బోర్డుతో సంబంధాలున్నాయంటూ వస్తున్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ డిమాండ్ గురించి విలేఖరులు ప్రశ్నించగా.. ఆయనకు వేరే పనులేవీ లేవని, రోజుకొక ప్రకటన చేస్తుంటారని, వాటన్నింటికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెన్నై చేరిన స్టడ్ ఆమ్‌స్టర్‌డామ్ నౌక



అడయార్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ నుంచి చెన్నై పోర్ట్‌కు వచ్చిన నెదర్లాండ్స్‌కు చెందిన 'స్టడ్ ఆమ్‌స్టర్‌డామ్' నౌకకు పోర్టు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. మొత్తం 27 మంది సిబ్బందితో పాటు ఎనిమిదిమంది ప్రయాణికులు ఈ నౌకలో వచ్చారు. ఈ నౌక డిసెంబరు ఒకటో తేదీ వరకు చెన్నై పోర్టులో ఉంటుంది. చెన్నై పోర్ట్ అధికారులు అంతర్జాతీయ పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తూ, అనేక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా బలపడేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో నెదర్లాండ్‌కు చెందిన ఈ నౌక చెన్నై పోర్టుకు వచ్చింది. 76 మీటర్ల పొడవు, 2,200 చదరపు మీటర్ల సెయిల్స్ కవరింగ్ ఏరియా కలిసిన ఈ ప్రయాణికుల నౌక హిస్టారికల్, మోడరన్ ఇన్నోవేషన్‌లో కూడుకుని ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నెదర్లాండ్స్, ఇతర హోస్ట్ దేశాల మధ్య బలమైన చారిత్రక, సాంస్కృతిక పరమైన బంధాన్ని పటిష్ఠం చేయడం ఈ నౌక ముఖ్యోద్దేశం. చెన్నై పోర్టుకు వచ్చిన సందర్భంగా ఈ నౌకలో వివిధ రకాలైన కార్యక్రమాలను నెలాఖరు వరకు నిర్వహించనున్నారు. ఈ నౌకా సిబ్బందికి చెన్నై పోర్ట్ అథారిటీ ఛైర్‌పర్సన్ సునీల్ పాలివాల్ సహా ఇతర ఉన్నతాధికారులు సాదరస్వాగతం పలికారు.

మళ్లీ ద్రావిడ పాలన కోసం పాటుపడండి

● డీఎంకే కార్యకర్తలకు పిలుపునిచ్చిన ఉదయనిధి

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరుగబోయే ఎన్నికల్లో కూడా ఘనవిజయం సాధించి ద్రావిడ మోడల్ ప్రభుత్వం ఏర్పాటయ్యేలా డీఎంకే కార్యకర్తలు యుద్ధ సైనికుల్లా పనిచేయాలని డిప్యూటీ సీఎం ఉదయనిధి సూచించారు. కడలూరులో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఉదయనిధికి మంజకుప్పం ప్రాంతంలో డీఎంకే శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కడలూరులో కలైంజర్ శతజయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 12,100 మంది లబ్ధిదారులకు రూ.80 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను ఉదయనిధి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే బుధవారం తన జన్మదినం సందర్భంగా పార్టీ కార్యకర్తలు బ్యానర్లు ఏర్పాటుచేయొద్దని, బాణాసంచా కాల్చరాదని విజ్ఞప్తి చేశారు. ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాల ద్వారా పేదలకు సహాయాలు పంపిణీ చేయాలని, పాఠశాల విద్యార్థులకు పోటీలు ఏర్పాటుచేసి విజేతలకు బహుమతులు అందజేయాలని కోరారు. తన జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో మళ్లీ ద్రావిడ మోడల్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రతిజ్ఞ చేయాలని, పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు సమన్వయంతో 2026 అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ఇప్పటినుంచే ప్రారంభించాలని ఉదయనిధి పిలుపునిచ్చారు.



దివ్యాంగురాలికి స్కూటర్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

శిశువులకు బంగారు ఉంగరాలు...

డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ బుధవారం 48వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధపడుతున్నారు. బుధవారం నుంచి డిసెంబరు 27వ తేది వరకు జన్మించే శిశువులకు బంగారు ఉంగరం, తల్లులకు సంక్షేమ సహాయాలు అందజేయనున్నట్లు పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కాశిముత్తుమాణిక్యం, మంత్రి కోవై చెళియన్ ఓ ప్రకటనలో కోరారు.

9 నుంచి అసెంబ్లీ

● స్పీకర్ అప్పావు



మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు వచ్చే డిసెంబరు 9 నుంచి ప్రారంభం కానున్నాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. స్పీకర్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో స్పీకర్ అప్పావు మాట్లాడుతూ... డిసెంబరు 9వ తేది ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశం జరుగుతుందని, ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలనే అంశాన్ని సభా వ్యవహారాల మండలి కమిటీ చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఆధునిక సాంకేతిక పాఠ్యాంశాలను నేర్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ సమావేశాలు డిజిటలైజేన్ విధానంలో కొనసాగాయని స్పీకర్ వివరించారు. అసెంబ్లీ 2024వ సంవత్సరం తొలి సమావేశం ఫిబ్రవరి 12న గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు 15న ముఖ్యమంత్రి స్టాలిన్ సమాధానాలు చెప్పారు. ఫిబ్రవరి 19వ తేది రాష్ట్ర ప్రభుత్వ 2024-25 వార్షిక బడ్జెట్‌ను మంత్రి తంగం తెన్నరసు, 20న వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం ప్రవేశపెట్టారు. ఈ రెండు బడ్జెట్లపై 22వ తేది వరకు జరిగిన చర్చలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు సమాధానం చెప్పారు. శాఖల వారీగా ఆర్థిక పద్దులకు సంబంధించిన అంశాలపై జూన్ 20 నుంచి 29వ తేది వరకు పది రోజులు చర్చలు జరిగాయి. అసెంబ్లీ నిబంధనల ప్రకారం అసెంబ్లీ తొలి సమావేశాలు పూర్తయిన నేపథ్యంలో, మరో ఆరు నెలల్లో రెండో సమావేశం డిసెంబరు 9 నుంచి ప్రారంభం కానుందని స్పీకర్ అప్పావు తెలిపారు.

చెరువు స్థలంలో ఆక్రమణల తొలగింపు

● ఇళ్లను తొలగించేందుకు పోలీసుల చర్యలు ● నిరసనకు దిగిన స్థానికులు

● వేళచ్చేరిలో ఉద్రిక్తత ● బాధితులతో మంత్రి సుబ్రమణ్యం చర్చలు

● శాంతించిన నిరసనకారులు



జగన్నాథపురం చెరువు స్థలంలో ఓ ఇంటి నుంచి తొలగించిన సామగ్రిని పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో చెరువు స్థలాన్ని ఆక్రమించుకున్న 800 ఇళ్లను తొలగించేందుకు పోలీసులు చర్యలు చేపట్టడంతో అక్కడ నివసిస్తున్నవారంతా ధర్నాకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాజధాని నగరం చెన్నైలోని ప్రధాన చెరువుల్లో వేళచ్చేరి చెరువు కూడా ఒకటి. ఒకప్పుడు సుమారు 265 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆ చెరువు దురాక్రమణల కారణంగా ప్రస్తుతం 55 ఎకరాలకు తగ్గిపోయింది. ఇక ఆ చెరువులో మురుగునీరు కూడా కలుస్తుండటంతో దుస్థితికి చేరింది. ఈ పరిస్థితుల్లో ఆ చెరువు స్థలం ఆక్రమణలను తొలగించి చెరువుకు పూర్వపు పరిస్థితి కలిగించాలని న్యాయస్థానం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు వేళచ్చేరి చెరువు చుట్టూ ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాల వివరాలను అధికారులు సేకరించారు. సుమారు 800 నివాసాలు ఆ చెరువు స్థలంలోనూ, చెరువుగట్టు స్థలాల్లో ఉన్నాయని నిర్ధారించారు. ఆ ఇళ్ళ తొలగించేందుకు రెవెన్యూ అధికారులు, జీసీసీ అధికారులు సంయుక్తంగా చర్యలు ప్రారంభించారు. ఆ ఇళ్లలో నివసిస్తున్నవారికి ఇటీవలే నోటీసులు కూడా ఇచ్చారు. అంతేగాకుండా ఆక్రమిత ప్రాంతాలను బయోమెట్రిక్ విధానం కూడా చేపట్టారు. సోమవారం రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు పోలీసులతో వెళ్లి బయోమెట్రిక్ గణన చేపట్టినప్పుడు వేళచ్చేరి జగన్నాథపురం ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 500 మంది మహిళలు రాస్తారోకో, ధర్నా జరిపారు. వీరి ఆందోళనకు వేళచ్చేరి అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే అశోక్, ఆ పార్టీ స్థానిక నాయకులు మద్దతు ప్రకటించారు. స్థానికులకు మద్దతుగా పార్టీ కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల బలగాలను పెద్ద యెత్తున మోహరించారు.



రాస్తారొకో జరుపుతున్న మహిళలు

సత్ఫలితాన్నిచ్చిన మంత్రి చర్చలు...

వేళచ్చేరిలో ఆందోళనకు దిగిన జగన్నాథపురం వాసులతో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం చర్చలు జరిపారు. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకే అక్కడి ఇళ్ళను తొలగించాల్సి వచ్చిందని, ప్రభుత్వం బయోమెట్రిక్ పద్ధతిలో గణంకాలు సేకరించడం కూడా స్థానికులకు మేలు చేయడానికేనని, ఆ ప్రాంతాల్లో ఉన్న 955 కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళుతుందని ఆందోళనకారులకు ఆయన భరోసా ఇచ్చారు. మంత్రి భరోసాతో మహిళలంతా ఆందోళన విరమించుకున్నారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తేనాంపేట పరిధిలోని పోయస్ గార్డెన్, టీవీ రోడ్డు, జయమ్మాళ్ రోడ్డు, ఇళంగో రోడ్డు, పోయస్ రోడ్డు ప్రాంతాలు, రాజకృష్ణా రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, పెరియార్ రోడ్డు, కామరాజర్ రోడ్డు, కామరాజర్ వీధి, సీతమ్మాళ్ కాలని, కేబీ దాసన్ రోడ్డు, భారతియార్ వీధి, భక్తవత్సలం వీధి, అప్పాదురై వీధి, ఆర్టీఓటీ, కథీడ్రల్ రోడ్డు, జేజే రోడ్డు, పార్థసారథి పేట, పార్థసారథి గార్డెన్, కేఆర్ రోడ్డు, జార్జ్ అవెన్యూ, ఎస్ఎస్ఐ రోడ్డు, హెచ్‌డీ రాజా వీధి, ఏఆర్కే కాలని, అన్నాసాలై, వీనస్ కాలని, మూర్‌రేస్ గేట్ రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఐఏఎస్ అధికారి పేరుతో నకిలీ ఖాతా

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ఐఏఎస్ అధికారి పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతా ప్రారంభించి, గుర్తుతెలియని వ్యక్తులు మోసానికి పాల్పడడం కలకలం రేపుతోంది. సాంకేతిక పరిజ్ఞానంలో రోజురోజుకు వస్తున్న మార్పులను తమకు అనుకూలంగా మలచుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఆ ప్రకారం, సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు ప్రారంభించి, సహాయం అడుగుతూ మోసాలకు పాల్పడడంపై అందుతున్న ఫిర్యాదులు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్ర సహకార శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి రాధాకృష్ణన్ ఫొటో, ఆయన పేరుతో నకిలీ ఖాతా ప్రారంభించి మోసానికి పాల్పడుతున్నారు. ఈ ఖాతా నుంచి సీఆర్‌పీఎఫ్‌ఎకు నగదు పంపించాలని, ఆయన స్నేహితులకు మెసేజ్‌లు వెళుతున్నాయి. అలాగే, క్యూ ఆర్ కోడ్ పంపి జీపే ద్వారా నగదు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఐఏఎస్ అధికారి రాధాకృష్ణన్ స్పందిస్తూ... తన పేరుతో సోషల్ మీడియా నకిలీ ఖాతా ప్రారంభించి పలువురిని నగదు సాయం అందించాలని కోరుతూ మెసేజ్‌లు పంపుతున్నారని, ఇలాంటి మెసేజ్‌లను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ వ్యవహారంపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాధాకృష్ణన్ తెలిపారు.

రూ.30 కోట్లతో బస్‌షెల్టర్ల ఆధునికీకరణ

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 825 బస్‌షెల్టర్ల ఆధునికీకరణకు రూ.30 కోట్లతో టెండర్లు విడుదల చేశారు. జీసీసీ పరిధిలో 1,265 బస్‌షెల్టర్లున్నాయి. వీటిలో 400 బస్‌షెల్టర్ల పర్యవేక్షణ 2015లో ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. తాజాగా, 825 బస్‌షెల్టర్లను రూ.30 కోట్లతో ఆధునికీకరించేందుకు కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. స్టెయిన్‌లెస్ సీట్ సీటింగ్, డిజిటల్ బోర్డులు తదితరాలు ఏర్పాటుచేసి, 8 ఏళ్ల పర్యవేక్షణకు ప్రైవేటు సంస్థకు అప్పగిస్తున్నట్లు కార్పొరేషన్ తెలిపింది.

రిప్పన్ భవనాన్ని చూసొద్దాం రండి...!

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం పురాతనమైనది. ఈ భవనంలోని విశేషాలు, నగరాభివృద్ధికి జీసీసీ చేపడుతున్న పథకాలు, కార్యనిర్వహణ తదితరాలు తెలుసుకొనేందుకు ప్రజలు సందర్శించవచ్చు. ఆసక్తి కలిగిన వారు https://forms.gle/2BpuXjHyNH9At48r6 అనే వెబ్‌సైట్‌లో ముందుగా పేర్లు నమోదుచేసుకోవచ్చు. ఇప్పటివరకు భవన సందర్శనకు 1,000 మంది పేర్లు నమోదుచేసుకోగా, ఆదివారం 260 మంది వీక్షించారు. వారికి మేయర్ సంతకంతో కూడిన రిప్పన్ భవనం నమూనాతో కూడిన తపాలా కార్డును బహుమతిగా అందజేసినట్లు అధికారులు తెలిపారు.

అన్నదాతల దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక బ్రహ్మోత్సవాలు డిసెంబరు 13 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల రోజుల్లో భక్తులకు అన్నదానం చేయగోరు వ్యక్తులు, సంస్థలు ఠీఠీఠీ.జూఽఖిూఽజూ౨.జీ అనే వెబ్‌సైట్‌లోను, తిరువణ్ణామలై-సెంగం రోడ్డు సమీపంలోని పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఆహార భద్రతా శాఖ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 044-237416, 9047749266, 9865689838 అనే నెంబర్లు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ భాస్కర పాండ్యన్ ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లిపట్టణం పాఠశాల విద్యార్థులకు కౌన్సెలింగ్

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో ఉపాధ్యాయురాలు దారుణ హత్యకు గురైన పాఠశాల విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఓ కల్యాణ మండపంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు సోమవారం వేర్వేరుగా కౌన్సెలింగ్ ఇచ్చారు. మల్లిపట్టణం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రమణి తరగతి గదిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటన కారణంగా పాఠశాలకు వారం రోజులు సెలవు ప్రకటించగా, సోమవారం విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వగా, మంగళవారం నుంచి పాఠశాల ప్రారంభించనున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

మదురైలో అన్నాడీఎంకే నేతల బాహాబాహీ



కొట్లాడుకుంటున్న అన్నాడీఎంకే నేతలు

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మదురైలో మాజీ మంత్రి సెల్లూరు రాజు అధ్యక్షతన జరిగిన అన్నాడీఎంకే స్థానిక నేతల సమావేశం రసాభాసగా ముగిసింది. మదురైలో పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా మారిందంటూ వేదికపై ఉన్న నేతలకు చెప్పడానికి వెళ్లిన స్థానిక నాయకులను వేదికపై ఉన్నవారు అడ్డుకోవడంతో ఇరువర్గాలవారు ముష్టియుద్ధానికి పాల్పడ్డారు. దీంతో నేతల మధ్య తొక్కిసలాట జరిగింది. రాష్ట్రంలో పార్టీని బలపరిచే దిశగా అన్నాడీఎంకే జిల్లా శాఖ నేతలు, ఇన్‌ఛార్జులుగా ఉన్న మాజీ మంత్రులు క్షేత్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ మేరకు మదురై కామరాజర్‌రోడ్డులోని రాష్ట్ర వర్తక సంఘం భవనంలో సోమవారం ఉదయం పార్టీ నిర్వాహకుల సమావేశం జరిగింది. మాజీ మంత్రి సెల్లూరు రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నత్తం విశ్వనాధన్, సెమ్మలై తదితరులు పాల్గొన్నారు. నత్తం విశ్వనాథన్ సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ స్థితిగతులు, పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై స్థానిక నాయకులు తమ అభిప్రాయాలను చెప్పాలంటూ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు మదురై బైక్రా చెళియన్, రామచంద్రన్, మునిసాలై శరవణన్ తదితరులు 'సర్పీల నుండి లేచి వేదికవైపు నడిచారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మదురై నియోజకవర్గంలో పార్టీ తృతీయ స్థానానికి దిగజారి పోయిందని, ఆ విషయమై మాజీ మంత్రులకు ఫిర్యాదు చేయాలనుకుంటున్నామని చెబుతూ వేదికపై ఎక్కారు. వెంటనే వేదికపై నున్న పార్టీ నేతలు కొందరు వారిని అడ్డుకున్నారు. ఆ సందర్భంగా ఇరువర్గాలకు చెందిన నాయకులు పరస్పరం దూషణలకు పాల్పడి ముష్టి యుద్ధానికి పాల్పడారు. దీంతో ఇరువర్గాల మధ్య తొక్కిసలాటలు జరిగాయి. పరిస్థితి అధ్వాన్నంగా మారటంతో మాజీ మంత్రి నత్తం విశ్వనాధన్ కొట్లాటలు మానండంటూ కేకలు పెట్టారు. అయినా ఆ నాయకులు పట్టించుకోకుండా పరస్పరం దాడికి దిగారు.

ప్రేమించలేదంటూ యువతిపై దాడి

- యువకుడి అరెస్టు



అరెస్టయిన సిద్ధిక్‌రాజా

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మదురై ఒత్తకడై ప్రాంతంలో తన ప్రేమను నిరాకరించిందనే ఆగ్రహంతో జిరాక్స్ షాపులో పనిచేస్తున్న యువతిపై దాడిచేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. గత కొద్ది నెలలుగా ఒత్తకడై ప్రాంతానికి చెందిన సిద్ధిక్ రాజా ఆ యువతి వెంటబడుతూ తనను ప్రేమించమంటూ వేధింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం జిరాక్స్‌షాపులో పనిచేస్తున్న యువతి వద్దకు వెళ్లి తనను ప్రేమించమని ప్రాధేయపడ్డాడు. కానీ ఆ యువతి ప్రేమించే ప్రసక్తేలేదని, తనను వేధించవద్దని తిట్టిపోసింది. దీంతో ఆగ్రహించిన సిద్ధిక్‌రాజా ఆమెపై మారణాయుధాలతో దాడి జరిపి పారిపోయాడు. ఆ సంఘటనలో యువతి తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం మదురై రాజాజీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలించి సిద్ధిక్‌రాజాను అరెస్టు చేశారు. ఆ సందర్భంగా సిద్ధిక్ రాజా పోలీసుల కస్టడీ నుండి పారిపోయేందుకు ప్రయత్నించి రోడ్డుపై పడటంతో అతడి కుడిచేయి విరిగింది. అతడికి ఆసుపత్రిలో చికిత్స చేయించి జైలుకు తరలించారు.

ఆరు కిలోల గంజాయితో యువకుడి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఆరు కిలోల గంజాయితో తిరుప్పూర్‌కు చెందిన సంతోష్ (28)ని ఆదివారం రాత్రి రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వ్యక్తి ప్రయాణించిన ధన్‌బాద్-అలపుళ ఎక్స్‌ప్రెస్ సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో కొంతసేపు ఆగింది. అప్పుడు రైల్వే పోలీసులు రైలు బోగీల్లో ప్రయాణికుల లగేజీ తనిఖీచేశారు. ఆ సమయంలో అనుమానంతో సంతోష్ లగేజీ తనిఖీచేసి, అందులోని 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మాదకద్రవ్యం విక్రయించిన కేసులో మరో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కం నియోజకవర్గ పరిధిలోని పాడిలో మాదకద్రవ్యం విక్రయించిన కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి రూ.6 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మద్రాసు హైకోర్టు భద్రతా విభాగంలో ఎస్ఐ భర్త కుమరవేల్, కావాంగరైకు చెందిన దిబేష్, పార్తీపన్, అమీర్‌భాషా, సుభాష్, మైకేల్ అనే వారు ఆన్‌లైన్‌లో విద్యార్థులు, యువతకు మెతాబెటామిన్ అనే మాదకద్రవ్యాన్ని విక్రయిస్తూ ఇటీవల పోలీసులకు పట్టుబడ్డారు. వారిచ్చిన సమాచారంతో తంజావూరుకు చెందిన వెంకటేష్, బెంగళూరుకు చెందిన గోవర్ధన్‌రెడ్డిలను ఆదివారం అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 64 గ్రాముల మెతాబెటామిన్, రూ.6 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం వారిని కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం... ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నొలంబూర్ ప్రాంతంలోని స్పా సెంటర్‌లో వ్యభిచారం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీరామ్ నగర్ మెయిన్ రోడ్డులోని ఓ స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు నొలంబూర్ సీఐకు సమాచారం అందింది. దీంతో ఆ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు, వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించి, అదే ప్రాంతానికి చెందిన కరణ్, ఆదంబాక్కంకు చెందిన రాజశేఖరన్, కళ్లకుర్చి జిల్లా కొవుత్తమంగళం ప్రాంతానికి చెందిన శివకుమార్‌లను అరెస్ట్ చేశారు. అలాగే, కేంద్రంలో పొరుగు రాష్ట్రాలకు చెందిన 8 మంది మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

- ప్రధానోపాధ్యాయుడి అరెస్ట్

తిరుత్తణి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు కటకటాలపాలయ్యాడు. తిరువళ్లూర్ జిల్లా లోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొద్దిరోజుల క్రితం 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలుపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుత్తణి డీఎస్పీ కందన్ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఆయన ఆదేశాలతో ఆర్కేపేట ఇన్‌ఛార్జి సీఐ మలర్, అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాఖీకుమారి పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి హెచ్‌ఎంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

మేల్‌మరువత్తూరు వద్ద దెబ్బతిన్న సిగ్నల్

- రైళ్ల రాకపోకలకు అంతరాయం

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మేల్‌మరువత్తూరు సమీపంలో రైల్వేగేట్ నుంచి ఇనుమ కమ్మీ ఊడిపోవడంతో సిగ్నల్ వ్యవస్థ దెబ్బతింది. దీంతో ఆ మార్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మేల్‌మరువత్తూరు సమీపం సోత్తుపాక్కం - సెయ్యూరు మధ్య ఉన్న రైల్వేగేట్‌ను గేట్ కీపర్ వేస్తుండగా ఆ గేట్ నుండి ఊడిపోయిన పెద్ద ఇనుపకమ్మీ పక్కనే ఉన్న సిగ్నల్ పరికరంపై పడింది. దీంతో అక్కడి సిగ్నల్ లైట్లు వెలగలేదు. ఇంజనీరింగ్ నిపుణులు వెళ్లి సిగ్నల్ వ్యవస్థను సరి చేశారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన న్యాయవాదులు



న్యాయవాదులు లోపలికి వెళ్లకుండా తలుపులు మూసిన పోలీసులు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. వడమదురై పోలీస్ స్టేషన్‌లో న్యాయవాది వరదరాజ్‌పై అంటరానితనం నిర్మూలన చట్టం కింద కేసు నమోదైంది. రాజకీయ దురుద్దేశంతో ఈ కేసు నమోదుచేసినట్లు ఆరోపించిన వరదరాజ్ మద్దతురాలైన కొందరు న్యాయవాదులు కలెక్టర్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట బందోబస్తులో ఉన్న పోలీసులు, న్యాయవాదులు కార్యాలయంలోకి వెళకుండా ప్రవేశ ద్వారం తలుపులు మూసివేశారు. దీంతో, న్యాయవాదులు పోలీసులతో వాగ్వివాగానికి దిగారు. న్యాయవాదులు అదుపులోకి తీసుకున్న పోలీసులు మరో ప్రాంతానికి తీసుకెళ్లి చర్చలు జరుపుతున్నారు.

డయాలసిస్ యంత్రాల నిర్వహణపై హైకోర్టు అసంతృప్తి

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో డయాలసిస్ యంత్రాల నిర్వహణపై హైకోర్టు మదురై బెంచ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో సరిపడేంత డయాలసిస్ యంత్రాల ఏర్పాటు, నిరంతర పర్యవేక్షణ, శాశ్వత టెక్నీషియన్లను ఏర్పాటుచేసేలా ప్రభుత్వానికి ఆదేశించాలని హైకోర్టు మదురై బెంచ్‌లో ప్రజావ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ సోమవారం విచారించిన న్యాయస్థానం, రాష్ట్రంలో 688 డయాలసిస్ యంత్రాలుండగా, 150 మంది తాత్కాలిక సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారనే విషయం దిగ్భ్రాంతి కలిగిస్తుందని, శిక్షణ పొందుతున్న విద్యార్థులను కూడా టెక్నీషియన్లుగా వినియోగించడం బాధాకరమని పేర్కొంది. ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన డయాలసిస్ పరికరాలు ఏర్పాటుచేసి శాశ్వత సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసింది.

దేవదాథన్ ఆస్తుల స్తంభనకు హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇండియా మక్కల్ కల్వి మున్నేట్ర కళగం అధ్యక్షుడు దేవనాథన్ ఆస్తులు తాత్కాలికంగా స్తంభింపజేయాలంటూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ది మైలాపూర్ హిందూ పర్మినెంట్ ఫండ్ ఛైర్మెన్ ఎం.సతీష్‌కుమార్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. పెట్టుబడిదారుల నుంచి రూ.24.50 కోట్లు డిపాజిట్లుగా పొంది మోసం చేశారంటూ దేవనాథన్ యాదవ్, గుణశీలన్, మహిమై నాథన్‌లను అరెస్ట్ చేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసిన న్యాయస్థానం, తదుపరి విచారణ జనవరి 7వ తేదీకి వాయిదావేసింది.

కోవైలో ఎన్‌టీకే శిబిరం ఖాళీ

- సెంథిల్‌బాలాజీ సమక్షంలో డీఎంకే తీర్థం



డీఎంకేలో చేరిన నామ్‌తమిళర్ కట్చి నిర్వాహకులతో మంత్రి సెంథిల్ బాలాజీ

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య నగరం కోవైలో నామ్ తమిళర్ కట్చి ప్రముఖులు, స్థానిక నాయకులు ఆ పార్టీ సమన్వయకర్త సీమాన్ వైఖరి నచ్చక సామూహికంగా రాజీనామాలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కోయంబత్తూరు నార్త్ జిల్లా మాజీ కార్యదర్శి రామచంద్రన్ నాయకత్వంలో సుమారు 500 మంది మంత్రి సెంథిల్‌బాలాజీ సమక్షంలో డీఎంకే సభ్యత్వం స్వీకరించారు. పార్టీలో చేరినవారిని మంత్రి సెంథిల్‌బాలాజీ శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రన్ మీడియాతో మాట్లాడుతూ నామ్‌తమిళర్ కట్చి నేత సీమాన్ పార్టీ జిల్లా శాఖల నాయకుల అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని, పార్టీని అభివృద్ధి పరిచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మొండి వైఖరి ప్రదర్శిస్తూ డీఎంకేతో పాటు అన్ని పార్టీలపైనా దుమ్మెత్తి పోస్తున్నారని ఆరోపించారు. ఆయన తీరు నచ్చకే తామంతా పార్టీ నుండి వైదొలగి డీఎంకేలో చేరామని పేర్కొన్నారు.

హఠాత్తుగా ఊడిన బస్సు చక్రం

- ప్రయాణికులు సురక్షితం



వేళచ్చేరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమరి నుంచి వడచ్చేరికి ఆదివారం సాయంత్రం ప్రయాణికులతో టౌన్ బస్సు బయల్దేరింది. మార్గమధ్యంలో హఠాత్తుగా ముందు చక్రం ఊడిపోవడంతో అదుపుతప్పిన బస్సు కొంత దూరం వెళ్లి రోడ్డు పక్కన ఆగింది. బస్సు తక్కువ వేగంతో వెళ్తుండడంతో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. కాగా, నగరంలో నడుపుతున్న బస్సులు నాసిరకంగా ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

29 వరకు విద్యార్థుల భద్రత కమిటీల సమావేశాలు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించాలని పాఠశాలలకు ఉత్తర్వులందాయి. ఈ విషయమై పాఠశాల విద్య డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులను నిరోధించడం, వాటిపై అవగాహన కల్పించేలా ప్రతి ఏడాది నవంబరు 15 నుంచి 22వ తేది వరకు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ సమయంలో పరీక్షలు నిర్వహిస్తుండడంతో ఈ సమావేశాలను సోమవారం నుంచి 29వ తేది వరకు నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా 'విద్యార్థుల మనస్సు' అనే ప్రచారం చేపట్టామని, విద్యార్థులకు తమకు జరిగే వేధింపులపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యార్థులకు అందజేసే ఫిర్యాదులను సత్వరం '14417', '1098'కు తెలియజేయాలని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

గ్లెనెగల్స్ ఆస్పత్రిలో మహిళకు అరుదైన చికిత్స

అడయార్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్లెనెగల్స్ హాస్పిటల్‌లో నగరానికి చెందిన 48 యేళ్ళ మహిళకు అరుదైన వెన్నెముక చికిత్స జరిగింది. కొన్నేళ్ళుగా పక్షవాతానికి గురై, మంచానికే పరిమితమైన ఈ మహిళను ఈ ఆస్పత్రిలో చేర్చగా, వివిధ రకాలైన పరీక్షలు, స్కాన్‌లు నిర్వహించి, పక్షవాతానికి గల కారణాలను గుర్తించారు. ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, న్యూరోసర్జన్ డాక్టర్ నిగెల్ సిమ్స్, సీనియర్ కన్సల్టెంట్, స్పైన్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ పణి కిరణ్ తదితరుల నిపుణులతో కూడిన వైద్యుల బృందం ఆ మహిళకు ఆపరేషన్ కోసం సిఫార్సు చేసింది. ఈ ఆపరేషన్ అరుదైన పరిస్థితి కావడంతో అనేక మంది వైద్య నిపుణులు ఈ ఆపరేషన్‌లో భాగస్వాములయ్యారు. డిస్ట్రాక్షన్, కంప్రెషన్, ఎక్స్‌టెన్షన్, రిడక్షన్ (డీసీఈఆర్)గా పిలిచే ఒక వినూత్న శస్త్ర చికిత్సా విధానం, సాంకేతికను ఉపయోగించి ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. దీనిపై డాక్టర్ నిగెల్ సిమ్స్ స్పందిస్తూ, ఇది అత్యంత అరుదైన, ప్రత్యేక ఆపరేషన్. సీ1 నుంచి సీ2 వెన్నుపూసలను వేరు చేయడానికి, స్థిరీకరించడానికి బోన్స్ ఉపయోగించడం జరిగింది. ఎంతో సవాల్‌తో కూడిన ఈ అధునాతన శస్త్ర చికిత్సా నైపుణ్యం మాత్రమే, న్యూరోసర్జరీ, న్యూరో అనస్థీషియా, క్రిటికల్ కేర్‌తో సహా వివిధ బృందాల మధ్య ఎంతో సమన్వయంతో ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

విద్యా కార్యాలయాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన విద్యా కార్యాలయాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పాఠశాల విద్య అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లా విద్యాశాఖ కార్యాలయాల పనితీరు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను ఏర్పాటుచేశామన్నారు.. ఆ ప్రకారం, చెంగల్పట్టు జిల్లాకు పాఠశాల విద్య అసిస్టెంట్ డైరెక్టర్ కన్నప్పన్, చెన్నై జిల్లాకు ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ ఎం.పళనిస్వామి, తిరువళ్లూర్ జిల్లాకు ప్రాథమిక విద్య డైరెక్టర్ నరేష్, కడలూరు జిల్లాకు పరీక్ష శాఖ డైరెక్టర్ ఎస్.లత సహా 33 అధికారులను నియమించారు. వీరు డిసెంబరు, జనవరి నెలల్లో తనిఖీలు చేసి నివేదిక సమర్పిస్తారని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానంలో సునీల్

అడయార్, నవంబరు 25: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జానకీ రామచంద్రన్ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని అన్నాడీఎంకే అనుబంధ విభాగమైన ఎంజీఆర్ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ సునీల్ నేతృత్వంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని 130వ విభాగం పార్టీ నిర్వాహకుడు వడపళని సి.ఇళంపరుది ఏర్పాటు చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జానకీ రామచంద్రన్ శతజయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగిన విషయం తెల్సిందే. ఇందులో భాగంగానే ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పార్టీ నేతలు ఏఈ దీనదయాళన్, వడపళని జెయ్, ఆర్.మధుసూదనన్, ఎస్.జయరామన్, టి.నగర్ పి.పద్మనాభన్, గార్డెన్ వి.సురేష్ కుమార్, ఎస్.సురేష్ కుమార్, కరాటే ఎస్ శేఖర్, కృష్ణమూర్తి, ఎస్.సతీష్ కుమార్, పోస్ట్ ఆఫీస్ చిన్నయ్య, ఆర్‌సీపీ ప్రభాకరన్, ఆర్.సూర్య రమేష్, వి.జయశంకర్, ఈ.మోహన కృష్ణన్, టి.సుడలైముత్తు, ఎంఏ ముస్తాఫా, ఎ.విశ్వనాథన్, ఎం.లోకనాథన్, కేఎస్ అరవిందన్, డాక్టర్ దేవరాజన్, విప్రకాష్, భారీ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అక్రమార్జన కేసు.... దర్యాప్తు అనుమతి కోసం గవర్నర్‌కు లేఖ

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ అక్రమార్జన కేసుపై విచారణ జరిపేందుకు అనుమతి కోరుతూ రాష్ట్ర గవర్నర్‌కు డీజీపీ లేఖ రాసారని ప్రభుత్వ న్యాయవాది మద్రాసు హైకోర్టుకు తెలిపారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆవిన్ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి వద్ద నగదు వసూలుచేశారనే కేసులో మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ అరెస్టయి, బెయిలుపై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు దాఖలుచేసిన పిటిషనర్ మురుగన్ హైకోర్టులో కొత్త అంశంతో దాఖలుచేసిన పిటిషన్‌లో... రాజేంద్ర బాలాజీకి సంబంధించి దాఖలైన అవినీతి కేసులో ఎలాంటి పురోగతి లేదని తెలిపారు. ఈ అక్రమార్జన కేసు విచారణ త్వరతగతిన పూర్తిచేసేలా ఉత్తర్వులు జారీచేయాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసు హైకోర్టు న్యాయమూర్తి రిషికేష్‌రాయ్ నేతృత్వంలోని బెంచ్ ముందు సోమవారం విచారణకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన అడిషినల్ సొలిసిటర్ జనరల్ అమీత్‌ఆనంద్‌తివారి ఓ అఫిడవిట్ దాఖలుచేశారు. అందులో... రాజేంద్ర బాలాజీ వద్ద విచారణకు అనుమతించాలని కోరుతూ గవర్నర్‌కు రాష్ట్ర డీజీపీ లేఖ రాశారని, త్వరలోనే ఈ లేఖకు తగిన ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశముందని తెలిపారు. ఇరుతరపు వాదనల అనంతరం తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదావేశారు.

రాందాస్‌ను అవమానిస్తారా?

- క్షమాపణ చెప్పాల్సిందే
- పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి డిమాండ్

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌ను కించపరిచేలా విమర్శలు చేసిన ముఖ్యమంత్రి స్టాలిన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి డిమాండ్ చేశారు. ఢిల్లీలో అన్బుమణి మీడియాతో మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న స్టాలిన్ సుదీర్ఘరాజకీయ అనుభవం కలిగిన రాందాస్‌ను కించపరిచేలా విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. స్టాలిన్ వెంటనే రాందాస్‌కు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే తమ పార్టీ శ్రేణులను ఆగ్రహావేశాలను కట్టడి చేయడం సాధ్యం కాదని అన్బుమణి హెచ్చరించారు.

తమిళిసై ఖండన...

పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్‌ను కించపరిచేలా సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారని బీజేపీ సీనియర్ నాయకురాలు డాక్టర్ తమిళిసై మండిపడ్డారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎవరికి పనులు లేకుండా చేస్తుందో నిర్ణయిస్తాయని ఆమె పేర్కొన్నారు.

సీఎం చేతగానితనం...

రాందాస్ చేసిన ప్రకటనకు సమాధానం చెప్పకుండా ఆయన్ని కించపరిచేలా విమర్శించడం ముఖ్యమంత్రి స్టాలిన్ చేతగానితనానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్‌పేజీలో ఓ ప్రకటన విడుదల చేశారు. అదానీ కంపెనీలతో డీఎంకే ప్రభుత్వానికి, స్టాలిన్ కుటుంబీకులకు సంబంధాలున్నాయంటూ వచ్చిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని సీనియర్ రాజకీయ నేత చేసిన ప్రకటనను స్టాలిన్ పట్టించుకోకుండా ఆయనకు వేరే పని లేదంటూ అహంకారపూరితంగా బదులివ్వటం గర్హనీయమన్నారు.

డిప్యూటీ సీఎం జన్మదినం సందర్భంగా సహాయాల పంపిణీ



సహాయాలు అందజేస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కాట్పాడి యువజన విభాగం ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా పేదలకు సహాయాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వేలూరు కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్‌కుమార్ అధ్యక్షత వహించగా, నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 47 మంది వితంతువులు, 47 మంది పేద మహిళలు, 47 మంది హిజ్రాలకు సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి, ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, కార్పొరేటర్ శరవణన్, మాజీ మంత్రి మహ్మద్ సఫీ, పార్టీ నిర్వాహకులు దొరై శింగారం, వన్నియరాజ, రజని, శశికుమార్, వినాయకమ్ తదితరులు పాల్గొన్నారు.

రెండాకుల చిహ్నం వ్యవహారం... వారంలో ఎన్నికల కమిషన్ నిర్ణయం

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేకు రెండాకుల చిహ్నం కేటాయించరాదంటూ దాఖలైన పిటిషన్‌పై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీచేస్తామని ఎన్నికల కమిషన్ తెలిపింది. దిండుగల్ జిల్లాకు చెందిన సూర్యమూర్తి మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... అన్నాడీఎంకే అంతర్గతంగా నెలకొన్న వివాదాలకు సంబంధించి 2017 నుంచి 2022 వరకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేశాను. అలాగే, ఈ వ్యవహారానికి సంబంధించిన దాఖలుచేసిన సివిల్ కేసుల విచారణ ముగిసే వరకు, అన్నాడీఎంకేకు రెండాకుల చిహ్నం కేటాయించరాదని ఎన్నికల కమిషన్ చేసిన ఫిర్యాదుపై, ఇంతవరకు ఎలాంటి సమాధానం లేదు. అందువల్ల ఈ పిటిషన్‌పై ఎన్నికల కమిషన్ వైఖరి ఏంటి? అని తెలియజేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి ఆర్.సుబ్రమణియన్, న్యాయమూర్తి సి.కుమరప్పన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. గత ఫిబ్రవరిలో అందజేసిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ ఎందుకు చర్యలు చేపట్టలేదని ధర్మాసనం ప్రశ్నించింది. ఆ సమయంలో, అన్నాడీఎంకేకు రెండాకుల చిహ్నం కేటాయించరాదని దాఖలైన పిటిషన్‌కు వారంలో రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ఎన్నికల కమిషన్ తరఫున ధర్మాసనానికి తెలియజేశారు. అందుకు అంగీకరించిన న్యాయస్థానం, తదుపరి విచారణ డిసెంబరు 2వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

3 వరకు జాలర్ల రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన 23 మంది రాష్ట్ర జాలర్ల రిమాండ్‌ను డిసెంబరు 3వ తేదీ వరకు ఆ దేశ న్యాయస్థానం పొడిగించింది. రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి మూడు ఫైబర్ పడవల్లో చేపల వేటకు వెళ్లిన 23 మంది జాలర్లను ఈ నెల 9న శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. వీరిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. రిమాండ్ గడువు ముగిసిన నేపథ్యంలో, జాలర్లను కోర్టులో హాజరుపరచగా, వారి రిమాండ్‌ను డిసెంబరు 3వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి నళిని సుభాస్కరన్ ఉత్తర్వులు జారీచేశారు.

గ్రీవెన్స్‌లో 260 వినతులు



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని ప్రజల నుంచి పలు సమస్యలతో కూడిన 260 వినతిపత్రాలు స్వీకరించి, వాటిని విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కలియమూర్తి, దివ్యాంగుల శాఖ సంక్షేమ అధికారి శరవణన్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కుటుంబ నియంత్రణపై పురుషులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు.


'మిస్ యూ'లో సిద్ధార్థ్ - ఆషియా రంగనాథన్

29న విడుదలయ్యే చిత్రాల్లో
ఆ రెండింటిపైనే అందరి దృష్టి

నవంబరు చివరి శుక్రవారమైన 29వ తేదీ ఏకంగా తొమ్మిది చిత్రాలు విడుదల కానున్నాయి. ఈ నెల 22న ఐదుకుపైగా చిత్రాలు విడుదలయ్యాయి. వీటిలో అనేక చిత్రాలు విడుదలైంది తెలియదు. థియేటర్ల నుంచి తీసివేసిన విషయం కూడా ప్రేక్షకులకు తెలియదు. ఈ నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ మరో 9 చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అయితే, ఆ సమయానికి తగినన్ని థియేటర్లు లభించక ఎన్ని చిత్రాలు వాయిదా పడతాయో తెలియదు. ఇప్పటివరకు వచ్చే శుక్రవారం 'అందనాల్', 'డబ్బాంకుత్తు', 'మాయన్', 'మిస్ యూ', 'సొర్గవాసల్', 'పరమన్', 'సైలెంట్', 'తిరుంబిపార్', 'సాదువన్' మూవీలున్నాయి. వీటిలో ఒకపుడు లవర్‌బాయ్‌గా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ - ఆషికా రంగనాథ్ నటించిన 'మిస్ యూ', ఆర్జే బాలాజీ, సానియ అయ్యప్పన్ నటించిన 'సొర్గవాసల్' ఉన్నాయి. ఈ రెండు చిత్రాలు మాత్రం ఎక్కువ థియేటర్లలో విడుదలకానున్నాయి. కారణం, వీటిలో ఒక చిత్రాన్ని (మిస్ యూ) రెడ్ జెయింట్ మూవీస్ రిలీజ్ చేస్తుండగా, 'సొర్గవాసల్' చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ విడుదల చేస్తోంది. దీంతో ఈ రెండు చిత్రాలపై ఇటు సినీ వర్గాలు, అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మిగిలిన చిత్రాల ఏ మేరకు వర్కౌట్ అవుతాయో వేచి చూడాల్సివుంది.


ఆర్జే బాలాజీ - సానియా అయ్యప్పన్

వ్యవసాయ ప్రాధాన్యతను వివరించే
'పరమన్'


'పరమన్'లో ఓ దృశ్యం

వ్యవసాయ ప్రాధాన్యతను వివరించేలా 'పరమన్' చిత్రాన్ని రూపొందించారు. రైతుల జీవితం, వారికష్టాలను వివరించేలా తెరకెక్కించారు. ఇన్ఫినిటీ పిక్చర్స్ పతాకంపై జె.శబరీష్ నిర్మించి, దర్శకత్వం వహించారు. ఇందులో 'జైభీమ్', 'పరియేరుం పెరుమాళ్' వంటి పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించిన సూపర్‌గుడ్ సుబ్రమణి హీరోగా నటించడం విశేషం. రాజకీయ ప్రముఖుడు పళ కరుప్పయ్య విలన్‌గా నటించారు. ఇప్పటివరకు పోషించని ఓ సీరియస్ పాత్రలో వయ్యాపురి కనిపించగా, హలో కందస్వామి, విజే అర్చన, మీసై రాజేంద్రన్, అశోక్ తమిళ్, సత్య, జయచంద్రన్, కార్తీక్ ప్రభు, సంజయ్, మధు తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. ఇప్పటికే నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ సహా పలువురు రాజకీయ నేతలు మూవీ చూసి చిత్ర బృందాన్ని అభినందించారు. విధ్వంసానికి గురవుతున్న ఈ కాలంలో వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యతను వివరించడం జరిగింది. ఇప్పటికే ఈ సినిమా పాటలు ప్రేక్షకుల్లో ఆదరణ పొందాయి' అని పేర్కొన్నారు.

'గగన్ మార్గాన్'లో విలన్‌గా విజయ్ ఆంటోనీ బంధువు

చిత్రజ్యోతి

విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన తాజా చిత్రం 'గగన్ మార్గాన్'. ఈ చిత్రం ద్వారా హీరో కుటుంబ సభ్యుడు ప్రతినాయకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. పేరు అజయ్ దీషన్. విజయ్ ఆంటోనీ స్వయంగా నిర్మించిన ఈ చిత్రానికి జాన్ పాల్ దర్శకుడు. ఈ సినిమాలో విజయ్ ఆంటోనీ పోలీస్ అధికారి పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'కుటుంబ సభ్యులంతా కలిసి చూసేలా ఉంటుంది. విజయ్ ఆంటోనీ నిర్మాతగా, హీరోగానే కాకుండా, సంగీతం కూడా సమకూర్చారు. ఇందులో అజయ్ దీషన్, సముద్రఖని, మహానది శంకర్, బ్రిగిడా, వినోద్ సాగర్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. విజయ్ ఆంటోనీ అక్క కుమారుడే ఈ యువ నటుడు అజయ్ దీషన్. ఈ విషయాన్ని మేకర్స్ ఒక పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ సినిమా తమిళం, తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో రూపొందిస్తున్నారు.


'గగన్ మార్గాన్'లో విజయ్ ఆంటోని - అజయ్ దీషన్

శంకర్ చిత్రంలో
కార్తీక్ సుబ్బరాజ్ పేరు.. ఎలా?



స్టార్ దర్శకుడు ఎస్.శంకర్ తెరకెక్కించిన సినిమాకు కథా రచయితగా తన పేరు వేయడం మాటల్లో వర్ణించలేనంత ఆనందంగా ఉందని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ అన్నారు. శంకర్ - రామ్ చరణ్ కాంబినేషన్‌లో రూపొందిన 'గేమ్ ఛేంజర్' సంక్రాంతికి విడుదలకానుంది. ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్ కథ సమకూర్చారు. ఈ నేపథ్యంలో గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న కార్తీక్ సుబ్బరాజ్ మాట్లాడుతూ, "గేమ్ ఛేంజర్ నా కోణంలో చూడాల్సిన మూవీ కాదు. దర్శకుడు శంకర్ కోణంలో నా కథను ఎలా తెరకెక్కించారన్నదే అమితాసక్తికరంగా ఉంది. శంకర్ - రామ్ చరణ్ చిత్రంలో నా పేరు ఉండటం గౌరవంగా భావిస్తున్నాను. శంకర్ చిత్రాలను చూస్తూ పెరిగాను. అలాంటి గొప్ప కళాకారుడి చిత్రంలో నా పేరు చూడటం ఒక కలగా భావిస్తున్నాను. ఆ సినిమా చూసేందుకు ఎంతో ఆత్రుతగా, ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు. కానీ, 'గేమ్ ఛేంజర్'కు కథ సమకూర్చిన కార్తీక్ సుబ్బరాజ్.. ఇటీవల 'జిగర్‌తండా డబుల్ ఎక్స్' పేరుతో బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ తీశారు. ఇపుడు సూర్య-44ను డైరెక్ట్ చేయనున్నారు. వచ్చే నెలలో సైట్స్‌పైకి తీసుకెళ్ళి, వచ్చే యేడాది వేసవిలో రిలీజ్ చేయనున్నారు.

కోలాటం ఆడుతూ గిరి ప్రదక్షిణ


కోలాటమాడుతున్న మహిళలు

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ వెనుక వైపున ఉన్న అన్నామలై కొండ చుట్టూ 14 కి.మీ గిరి ప్రదక్షిణ మార్గం ఉంది. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది మహిళా కళాకారులు భరత నాట్యం, కోలాటం చేస్తూ గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

క్యాన్సర్ బారినపడితే
అధైర్యపడొద్దు

● వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్


క్యాన్సర్ నుంచి కోలుకున్న వారితో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బారిన పడిన వారు అధైర్యపడకుండా ధైర్యంగా జీవించాలని వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అన్నారు . కాలేయ క్యాన్సర్ బారినపడి చికిత్స ద్వారా ఆరోగ్యవంతులైన వారి కలయిక సీఎంసీ ఆస్పత్రిలో జరిగింది. కార్యక్రమానికి వేలూరు బిషప్ మేలీద్ అబ్రహాం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వనాథన్ మాట్లాడుతూ... క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో పలువురు ఆ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందిస్తే ఈ వ్యాధి నుంచి బయటపడే అవకాశముందన్నారు. సీఎంసీ ఆస్పత్రిలో క్యాన్సర్ బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నారని ఛాన్సలర్ విశ్వనాథన్ ప్రశంసించారు. కార్యక్రమంలో సీఎంసీ ఆస్పత్రి జాయింట్ డైరెక్టర్ సౌమ్య సత్యేంద్రన్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజేష్, ఆసుపత్రి కౌన్సిల్ విభాగ అధ్యక్షుడు జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

రోటా టాలెంట్ పోటీల్లో
చిన్నారుల ప్రతిభ




విజేతలైన చిన్నారులతో నిర్వాహకులు

వేళచ్చేరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ టి.నగర్, నీతా మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో '32వ రోటా టాలెంట్ పోటీలు' జరిగాయి. కామరాజర్ అరంగంలో ఇటీవల ప్రత్యేక చిన్నారులకు ఈ పోటీలు నిర్వహించి, బహుమతుల ప్రదానం చేశారు. మొత్తం 44 పాఠశాలలకు చెందిన 1382 మంది ప్రత్యేక చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. ఈ పోటీలను నటుడు శ్రీకాంత్ ప్రారంభించగా, డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా, కేఎల్పీ ప్రాజెక్ట్ ఛైర్మన్ సునీల్ కెట్పాలియా, రోటరీ క్లబ్ టి.నగర్ ప్రెసిడెంట్ నరేంద్ర శ్రీమల్, రోటా టాలెంట్ ఛైర్మన్ జయశ్రీ బోత్రా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవల అంతర్జాతీయ చెస్ పోటీల్లో రాణించిన షెరాన్ రచేల్‌కు 'రోటరీ రోటా యూత్ ఐకాన్ అవార్డ్'తో సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాల బోర్డులో
'హరిజన కాలని'

● స్వయంగా చెరిపేసిన మంత్రి



హరిజన కాలనీ పదంపై
నల్లరంగు పూస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాల బోర్డులో ఉన్న 'హరిజన కాలనీ' అనే వాక్యాన్ని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ స్వయంగా నల్ల రంగు పూసి చెరిపివేశారు. ఊర్లు, వీధుల పేర్లు జాతులు, కులాల పేర్లతో ఉండరాదని న్యాయస్థానాలు ఉత్తర్వులు జారీచేశాయి. ఈ క్రమంలో, నామక్కల్ జిల్లా మనసముద్రం పంచాయతి యూనియన్ పరిధిలోని హరిజన కాలనీలో పంచాయతి యూనియన్ ప్రాథమిక పాఠశాల బోర్డులో 'హరిజన కాలనీ' అని రాశారు. ఈ పేరు తొలగించాలని కోరుతూ గ్రామస్తులు పలు ఆందోళనలు చేపట్టడంతో పాటు ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో, ఆ పంచాయతీలో సోమవారం పర్యటించిన మంత్రి అన్బిల్ మహేష్ పాఠశాలను పరిశీలించి, నల్ల రంగు తీసుకొని పాఠశాల బోర్డుపై ఉన్న హరిజన కాలనీ అన్న పదాన్ని తొలగించారు. అలాగే, ఈ పేరు తొలగించాలని పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన గ్రామపెద్ద గణేశన్‌ను మంత్రి అభినందించారు.

పర్సిమ్మన్...
ఔషధ గుణాల ఖర్జూరం



పెరంబూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా పాడి బోడి సమీపంలో ఔషధ గుణాలు కలిగిన జపాన్ ఖర్జూరాలు (పర్సిమ్మన్) పండ్లు కిలో రూ.300కు విక్రయిస్తున్నారు. చైనాలో ఎక్కువగా లభించే ఈ పండ్లను వందేళ్ల క్రితం కున్నూర్ సిమ్స్ పార్క్‌లో చెట్టు నాటారు. ఏడాదికి ఒకసారి పండ్లు కాసే గుణమున్న ఈ చెట్లు ప్రస్తుతం కోతకు వచ్చాయి. ఈ పండ్లు తీపి, పులుపు మిశ్రమంతో రుచిగా ఉండగా, 10 రోజుల వరకు పాడవని విధంగా ఉన్నాయి. ఈ పండ్లలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, పిల్లల నుంచి పెద్దల వరకు తీసుకోవచ్చని, హోల్‌సేల్ మార్కెట్లో కిలో రూ.200 నుంచి రూ.250, చిల్లర మార్కెట్లో రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయమవుతున్నాయని వ్యాపారులు తెలిపారు.

రిజర్వాయర్లలో
5 నెలలకు సరిపడా జలాలు



చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరానికి మంచినీరు సరఫరా చేసే ఐదు ప్రధాన జలాశయాల్లో వచ్చే ఐదు నెలలకు సరిపడా జలాలు మాత్రమే ఉన్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు ప్రకటించారు. పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, కన్నన్‌కోట తేర్వాయ్ కండిగ జలాశయాల ద్వారా నగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ జలాశయాలలో చోళవరం జలాశయం తప్ప మిగిలిన నాలుగు జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ జలాశయాలలో రోజురోజుకూ ఇన్‌ఫ్లో తగ్గుతోందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. డిసెంబర్‌లోగా రుతుపవన ప్రభావిత వర్షాలు సమృద్ధిగా కురిస్తే నగర ప్రజలకు నిరాటంకంగా నీటిని సరఫరా చేయగలుగుతామని చెప్పారు.


వంటకాలను తయారు చేస్తున్న సంజీవ్ కపూర్

మిమ్మల్ని ఇతరులతో పోల్చుకోవద్దు

● ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్

వేళచ్చేరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'మిమ్మల్ని మీరు ఇతరులతో పోల్చుకోవద్దు. ఏకాగ్రతతో ఉండండి. చిత్తశుద్ధితో పని చేయండి. విజయం మిమ్మల్ని వరించకపోదు" అని ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్ హితవు పలికారు. స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మాల్‌లో వెయ్యిమందికి పైగా ఔత్సాహిక ఆహారప్రియుల ఎదుట సంజీవ్ కపూర్ తన పాకశాస్త్ర నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎవరైనా ఇంట్లో రెస్టారెంట్ తరహాలో వంటకాలను ఎలా చేయవచ్చో ఈ సందర్భంగా ఆయన వివరించారు. అంతేగాక చెన్నైతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రేక్షకులు ఆయన్ని అభినందిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పొంగల్ గిఫ్ట్‌తో చీర, ధోవతి

● మంత్రి గాంధీ



ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కార్డులకు జనవరి మొదటి వారం నుంచి రేషన్ దుకాణాల ద్వారా పొంగల్ గిఫ్ట్‌తో చీర, ధోవతి పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి గాంధీ పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ... ఉచిత ధోవతి, చీరల పంపిణీ పథకానికి సంబంధించి నేత కార్మికులు తయారీ పనులు మూడు నెలల నుంచే ప్రారంభించారని తెలిపారు. 12,040 చేనేత మగ్గాలు, 54,190 మరమగ్గాల్లో నేత కార్మికుల సహకార సంఘాల సభ్యులను ప్రోత్సహించేలా వస్త్ర తయారీ ఆర్డర్లు అప్పగించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా, నేత కార్మికుల జీవనాధారం మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఇస్తోందని, ఉచిత చీర, ధోవతి, యూనిఫాం పథకాలను నేత కార్మికులకు వర్తింపజేయలేదని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పొంగల్ సందర్భంగా ఉచిత చీర, ధోవతితోపాటు చక్కెర, ఇతర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీచేసేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

నారాయణి పీఠం డైరెక్టర్‌కు
సేవా రత్న పురస్కారం

వేలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీపురం నారాయణి పీఠం డైరెక్టర్ డా.ఎం.సు



డాక్టర్ సురేష్‌బాబుకు పురస్కారం ప్రదానం చేస్తున్న
వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్

రేష్‌బాబుకు సేవా రత్న పురస్కారం ప్రదానం చేశారు. అన్నాసాలై సమీపం టోల్‌గేట్‌లో ఉన్న రాణి మహల్‌లో జరిగిన పురస్కారం ప్రదానం కార్యక్రమానికి వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం, స్థానిక ఎమ్మెల్యే కార్తికేయన్ పాల్గొని, సురేష్‌బాబు సేవలను కొనియాడారు. పలు రోటరీ సంఘాల అధ్యక్షుడిగా, మరికొన్ని సంఘాలకు గౌరవాధ్యక్షుడిగా పనిచేస్తున్న సురేష్‌బాబును పలువురు సత్కరించారు.


షోళింగనల్లూరులో దివ్యాంగుల సేవా కేంద్రం ప్రారంభించేందుకు వెళ్ళిన ముఖ్యమంత్రి స్టాలిన్‌తో కరచాలనం చేస్తున్న బాలికలు

కస్టమ్స్‌కు మరో మూడు జాగిలాలు

ప్యారీస్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిశూలం విమానాశ్రయ కస్టమ్స్ పరిధిలోని 'కే9' అనే దర్యాప్తు విభాగానికి మూడు కొత్త జాగిలాలు చేరాయి. కే9 విభాగంలో ఆర్లీ, ఆర్యో, స్నోబాయ్, రాక్ అనే నాలుగు జాగిలాలు విమానాల్లో తరలించే పేలుడు పదార్థాలు, మారణాయుధాలు, మాదకద్రవ్యాలను పసిగడతాయి. ఈ విభాగంలో కొత్తగా మూడు జాగిలాలను ఎంపిక చేసి, పంజాబ్ రాష్ట్రం అట్టారీలో ఉన్న కస్టమ్స్ శిక్షణ కేంద్రంలో 36 వారాలు శిక్షణ ఇస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో శిక్షణ పూర్తిచేసుకోనున్న జాగిలాలు కే9 విభాగానికి వచ్చి చేరుతాయని అధికారులు తెలిపారు.

రాష్ట్రపతి పర్యటనకు
చురుగ్గా ఏర్పాట్లు

● ఊటీలో హెలికాప్టర్ ట్రయల్ రన్


ఊటీ తీట్టుకల్ హెలిపాడ్ వద్ద దిగుతున్న వాయుసేన హెలికాప్టర్

చెన్నై, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నీలగిరి, తిరువారూరు జిల్లాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం ఈ నెల 27న విచ్చేయనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన కోసం పోలీసు ఉన్నతాధికారులు, కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆ మేరకు రాష్ట్రపతి కోయంబత్తూరు సూలూరు వైమానిక దళం నుంచి ఊటీ తీట్టుకల్ హెలిపాడ్ వరకు హెలికాప్టర్‌లో ప్రయాణించనున్నారు. సోమవారం ఉదయం భద్రతా విభాగం అధికారులు సూలూరు వైమానిక దళం నుంచి తీట్టుకల్ హెలిపాడ్ దాకా వాయుసేనకు చెందిన హెలికాప్టర్‌తో ట్రయల్ రన్ నడిపారు. అడిషనల్ ఎస్పీ సౌందరరాజన్, డీఎస్పీ యశోదా పర్యవేక్షణలో రెండు హెలికాప్టర్లు సూలూరు వైమానిక దళం నుండి తీట్టుకల్ హెలిపాడ్ వరకూ నడిపారు.


రిప్పన్‌భవనంలో సోమవారం మేయర్ ప్రియను మర్యాదపూర్వకంగా కలుసుకున్న బ్రిటిష్ డిప్యూటీ రాయబారి హలిమా హోలండ్

నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లబోతున్నా

ఇండియన్ షూటర్ ఎలవెనిల్ వలరివన్



తిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 2018 జూనియర్ ప్రపంచకప్‌లో భారత్‌కు బంగారు పతకాన్ని సాధించిన ఇండియన్ క్రీడా షూటర్ ఎలవెనిల్ వలరివన్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎలవెనిల్ వలరివన్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. చాలా రోజుల తర్వాత స్వామి దర్శనం లభించిందని, మంచి అనుభూతి కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో భోపాల్‌లో జరిగే నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు వెళ్లబోయే ముందు స్వామి ఆశీస్సుల కోసం తిరుమల వచ్చినట్లు తెలిపారు.



నేత్రపర్వం.. కోటి దీపోత్సవం

తిరుపతి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రామచంద్ర పుష్కరిణి ప్రాంగణంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసంలో 365 వత్తులతో దీపం వెలిగించడం ద్వారా ఏడాది పొడవునా దీపం వెలిగించకపోయినా ఆ అపరాధ భావన పోతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిల్మ్ సొసైటీ చైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరిరావు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, పారిశ్రామికవేత్త వీసీ రాయల్, ఫిల్మ్ సొసైటీకి చెందిన ప్రసాదరావు, బుజ్జిబాబునాయుడు, బండి మధుసూదనరెడ్డి, గుల్జార్, అనసూయ, మేరీజాయ్, శాంతావాణి, భాస్కర్, శమంతకమణి, భక్తులు పాల్గొన్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కార్తీక వెలుగుల్లో కపిలతీర్థం

కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా తిరుపతిలోని కపిలతీర్థంలో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ మహిళలు పిండి తలిగ వేసి నేతి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పుష్కరిణికి నాలుగు వైపులా ఉన్న మండపాలలో దీపాలను వెలిగించారు. జలపాతం కింద భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం కామాక్షి కపిలేశ్వరులను, పరిదేవతలైన వల్లీయమ్మ, సుబ్రమణ్య స్వామి, గురుదక్షిణామూర్తి, నాగలింగ కూటమిని దర్శించుకున్నారు.

శ్రీకాళహస్తిలో కార్తీకం రద్దీ



నాలుగో కార్తీక సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వర్ణముఖి నదిలో స్నానాలు ఆచరించి రెండోగేటు సమీపంలో భక్తులు దీపారాధన సమర్పించారు. సుమారు 37వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.50శీఘ్ర దర్శనం టిక్కెట్లు గరిష్ఠస్థాయిలో 5,725, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,822 కలిపి మొత్తం 9,547 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక ఐదు రకాల రాహుకేతుపూజలు కలిపి 4,169 జరిగాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



కాలుష్యం కోరల్లో విలవిల



'నిబంధనలు పాటించని పరిశ్రమల నుంచి నిరంతరం వెదజల్లుతున్న రసాయనాల వల్ల ఊపిరి తీసుకోలేకపోతున్నాం. గుండెజబ్బుల బారినపడుతున్నాం.. కళ్లు మంటలతో అల్లాడుతున్నాం. కాపాడండి సారూ' అంటూ రేణిగుంట మండల పరిధిలోని పారిశ్రామికవాడ పల్లెల ప్రజలు వేడుకుంటున్నారు. పీల్చే గాలి, తాగేనీరు కలుషితం కావడంతో ఎప్పుడు ఏ రోగం వస్తుందో తెలియక బతుకు జీవనం సాగిస్తున్నారు.

- పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న రసాయనాలు
- రోగాల బారిన పరీవాహక గ్రామాల ప్రజలు
- ఊపిరి తీసుకోలేక పోతున్నాం..కాపాడండి అంటూ వేడుకోలు



రసాయనాలు వెదజల్లుతున్న మైథిలి కర్మాగారం

కథనం రేణిగుంట,ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండలంలోని గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, రేణిగుంటలో మూడు పారిశ్రామిక వాడలున్నాయి. అప్పటి జనసంఖ్య ఆధారంగా ఈ ప్రాంతాలను పారిశ్రామికవాడలుగా గుర్తించి ప్రభుత్వం కేటాయించింది. నేడు వాటికి చుట్టుపక్కల జనాభా పెరగడంతో ఊర్లు, గ్రామాలు విస్తరించాయి. అదే తరుణంలో పారిశ్రామికవాడల్లో కాలుష్యం పెరిగింది. పరి శ్రమల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను యథేచ్ఛగా బయటకు వదిలేస్తున్నారు. ఈ విషయమై నల్లపాళెం, నీలసానిపేట, అత్తూరు, దేశమ్మనగర్, గాజులమండ్యం, ఎర్రంరెడ్డిపాళెం, వినాయకపురం గ్రామాల ప్రజలు అనేక పర్యాయాలు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులు చేశారు. చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించి తర్వాత గాలికొదిలేస్తున్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పారిశ్రామికవాడల్లో ప్రమాదాలు నెలకొన్న సమయాల్లో మాత్రం హడావుడి చేసి, నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపేదిశగా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

మురుగు కాలువలు లేక..

తిరుపతి-రేణిగుంట మార్గంలోని పారిశ్రామికవాడలో రోడ్లు, మురుగు కాలువలు లేవు. కర్మాగారాల్లో ఉపయోగించే నీటిని బయటకు వదిలేస్తున్నారు. దీంతో కింద ఉన్న ఎర్రంరెడ్డిపాలెం, వినాయకపురం గ్రామాల్లో నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ చూసినా ప్లాస్టిక్, చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్‌ను వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, ఈ ప్రాంతాల్లో పర్యటించి నోటీసులు జారీ చేస్తామని అన్నారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ కారిడార్ జోనల్ మేనేజరు చంద్రశేఖర్‌ను వివరణ కోరగా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి స్థానిక పరిశ్రమల నుంచి సగం వాటా పెట్టుకుంటే పై అధికారుల దృష్టికి తీసుకుపోయి స్థానిక సమస్యలను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తమకు వచ్చే పన్నులకు కేవలం పారిశ్రామికవాడలో లైట్లు, ఇతర చిన్న సమస్యలను పరిష్కరించగలమని స్పష్టం చేశారు.



రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



ఎర్రంరెడ్డిపాళెం పారిశ్రామికవాడలో రోడ్ల దుస్థితి

ఊపిరి తీసుకోలేకపోతున్నాం



మా గ్రామంలో 550 మంది నివసిస్తున్నారు. కర్మాగారాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అందుకే 2019లో ఎన్నికలను కూడా బహిష్కరించాం. దీంతో అప్పటి ఎన్నికల అధికారి, తహసీల్దారు ప్రాధేయపడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. నేటికీ సమస్య అలాగే ఉంది. గ్రామంలో అత్యధింగా గుండెపోటుకు గురవుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరులో ఇద్దరు మృతి చెందారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పరిశ్రమ నుంచి వెదజల్లే రసాయన వాయువు వల్ల రాత్రి ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉంది.

- మోహన్‌రెడ్డి, నల్లపాళెం గ్రామస్తుడు

నోటీసులిచ్చినా పట్టించుకోవడం లేదు



గాజులమండ్యం పారిశ్రామికవాడలోని పలు ఫార్మా కర్మాగారాల నుంచి వచ్చే వాయువుల వల్ల పరిసర గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, కళ్లమంటలకు గురవుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పలుసార్లు నోటీసులు ఇచ్చినా కర్మాగారాల యాజమాన్యాలు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మా గ్రామాల్లో సమస్యలను గుర్తించి, పరిష్కరించాలి.

- కరుణాకరరెడ్డి, అత్తూరు గ్రామస్తుడు

ప్రతి పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

● అధికారులకు కలెక్టర్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

సమీక్షలు .. సమావేశాలు

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'బడివైపు ఒక అడుగు- తల్లిదండ్రులతో ముచ్చట్లు' కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలోనూ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం రాత్రి జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనరు మౌర్య, డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి వారి పిల్లల అసెస్మెంట్ కార్డులను అందించాలన్నారు. పేరెంట్ మీటింగ్ రోజున డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా అందించే మెనూ ప్రకారం ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలిసి భోజనం చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యా విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, తాగునీరు, పారిశుధ్యం, పిల్లల రక్తహీనత, వారి ఆరోగ్య సమస్యలు తదితరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై సమీక్షించి పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులతోపాటు ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవోలు కూడా ఈ మీటింగులో పాల్గొనాలని, సచివాలయ సిబ్బందినీ భాగస్వామ్యం చేయాలన్నారు. పూర్వ విద్యార్థులనూ ఆహ్వానించాలన్నారు.

ఉచిత ఇసుక విధానంలో అక్రమాలకు తావివ్వొద్దు

అక్రమాలకు తావు లేకుండా నూతన ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్లో పలు అంశాలపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జియో ట్యాగింగ్ చేయడంపై సమీక్షిస్తూ ఏర్పేడు, వెంకటగిరి, కేవీబీపురం మండలాల్లో తక్కువ పురోగతి ఉందని, పుత్తూరు మునిసిపాలిటీ పనితీరు బాగుందన్నారు. ఈ నెల 30 నాటికి ఈ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీసీ రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పాట్‌హోల్స్ ఫ్రీ రహదారుల కాన్సెప్ట్ కింద ఆర్‌అండ్‌బీ కింద 66 పనులు మొదటి విడతగా చేపట్టినవి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ట్యూషన్ ఫీజు కోసం ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

రెండు ఇసుక డంప్‌ల సీజ్



రిలయన్స్ పెట్రోల్‌బంకు వెనుక ఇసుక డంప్

శ్రీకాళహస్తి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసినట్లు తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. శ్రీకాళహస్తి శివార్లలోని చెన్నై రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక వైపు, తంగేళ్లపాళెం వద్ద మూతపడిన ఓ స్టోన్ క్రషర్ ప్రాంగణంలో ఇసుక డంప్‌లున్నట్లు అధికారులు సమాచారం అందుకున్నారు. ఆదివారం రాత్రి తహసీల్దారు మధుసూదన రావు ఆదేశాలతో సీనియర్ అసిస్టెంట్ నారాయణ, వీఆర్వో దినేష్ రెండు డంప్‌లను సీజ్ చేశారు. అలాగే తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగ వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజీ ప్రాంతంలో ఇసుకను నిల్వ చేసి అక్కడి నుంచి తరలించినట్లుగా ఆనవాళ్లను గుర్తించారు. అయితే రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేసి దీని వెనుక మూలసూత్రధారులను బహిర్గతం చేయకపోవడంపై రెవెన్యూ అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘాట్‌లో ఎలుగుబంట్ల కలకలం

తిరుమల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో సోమవారం ఎలుగుబంట్ల సంచారం కలకలం రేగింది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డులో ఏనుగుల ఆర్చ్ దాటాక రెండు ఎలుగుబంట్లు రోడ్డు దాటి కాలినడకమార్గం వైపు వెళ్లడాన్ని కొందరు వాహనదారులు గుర్తించారు. వెంటనే సమాచారాన్ని టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులకు అందజేశారు. ఈక్రమంలో అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అప్పటికే ఎలుగుబంట్లు వెళ్లిపోయినట్టు నిర్ధారించుకున్నారు. అయినప్పటికీ వాహనదారులను, నడకమార్గంలో వచ్చే భక్తులను అప్రమత్తం చేసి పంపుతున్నారు.

వీఏకే రంగారావును సన్మానిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు



వెండి తెరపై రాముడు, కృష్ణుడు.. ఎన్టీఆరే

సినీ గేయ వజ్రోత్సవ సభలో వీఏకే రంగారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెండి తెరపై కృష్ణుడు, శివుడు, రాముడిగా ఎన్టీఆర్ తన నటనా ప్రావీణ్యంతో దర్శనమిచ్చారని ప్రముఖ సినీ, సంగీత, నాట్య, కళా విమర్శకుడు వీఏకే రంగారావు పేర్కొన్నారు. అనంతపురానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యాన ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాలులో సోమవారం జరిగిన ఎన్టీఆర్ వజ్రోత్సవ సినీ గేయ గోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినిమాల్లో ఎన్టీఆర్ పోషించిన వివిధ పాత్రల గురించి ఆయన ప్రస్తావించారు. సినీ కళారంగం పట్ల అంకిత భావం ఉండటం వల్ల ఒక పాత్రను పరిపూర్ణంగా పోషించగలిగారన్నారు. పౌరాణిక పాత్రల్లో ఆయన ఎంత సజీవంగా నటించారంటే.. వెండి తెరపై సాక్షాత్తు ఆ దేవతామూర్తులను చూసినంత అనుభూతిని ప్రేక్షకులు పొందారని చెప్పారు. తనకు తెలియని విషయాలను తెలుసుకోవడానికి ఎలాంటి సంశయం చూపేవారు కాదన్నారు. సినిమా రంగానికి సంబంధించి తన అభిప్రాయాన్ని ఎన్టీఆర్ ఎదుటే చెప్పినా, సహృదయంతో విమర్శను స్వీకరించారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమా పాటలను గుర్తు చేసుకోవడమంటే, తెలుగు జాతి తన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రనూ జ్ఞాపకం చేసుకున్నట్టు అవుతుందన్నారు. ప్రజలను చైతన్యం చేసే అంశాలు ఎన్టీఆర్ సినిమాల్లో అధికంగా ఉన్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు కొనియాడారు. నేటికీ ఎందరో కళాకారులు, రాజకీయ నాయకులకు ఎన్టీఆర్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు చెప్పారు. భాష, భావం, అభినయంలో ఎన్టీఆర్‌ను మరో పాత్రతో పోల్చలేమని రిటైర్డు ప్రొఫెసర్ జేవీ సత్యవాణి అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ సినీ రంగ ఔన్నత్యాన్ని ఈ తరానికి తెలియ చేయడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని మహాబోధి సాహిత్య వేదిక ప్రతినిధి ఆచార్య జి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, రిటైర్డు ప్రొఫెసర్లు కోసూరి దామోదర నాయుడు, కె.మునిరత్నం, ఎన్.మునిరత్నమ్మ, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.